క్లుప్తంగా

ముందు జాగ్రత్తలతో తెగుళ్ల నివారణ



రామదుర్గంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయలక్ష్మి

చిప్పగిరి: మందస్తు జాగ్రత్తలు పాటిస్తే పంట పొలాలకు సోకే తెగుళ్లను నివారించవచ్చని ఏఓ విజయలక్ష్మి మండల రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని గుమ్మనూరు, రామదుర్గం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో నూతన విధానాలు, ఆధునిక పనిముట్లు, యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు రోహిణి, లక్ష్మిదేవి, పంచాయతీ కార్యదర్శులు సిసింద్రి, సురేంద్ర పలువురు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమ్మెలోకి వైద్య సిబ్బంది



హొలహర్వి పీహెచ్‌సీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న సిబ్బంది

హొలహర్వి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పారా మెడికల్, ఓపీ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సమ్మె చేపట్టారు. వీరి సమ్మెకు వైద్యులు మద్దతు తెలియజేశారు. వైద్య సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంతవరకు తాము సమ్మెలోనే ఉంటామని చెప్పారు. వైద్య సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో రోగులకు ఓపీ సేవలు అందడం లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిన్నతనం నుంచే సేవా భావం అలవర్చుకోవాలి



ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న లక్ష్మీప్రసాద్

చిప్పగిరి: చిన్న తనం నుంచే సేవాభావం అలవర్చుకోవాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వరదరాజులు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సేవ, మంచి ప్రవర్తన, సామాజిక బాధ్యత, కళాశాలలో పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు లక్ష్మీ ప్రసాద్ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను అమితంగా ఆకట్టుకుంది.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో బాలిక అదృశ్యం కావడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి. అశోక్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలోని దుకాణంలో సరుకులు తెచ్చేందుకు బయటకు వెళ్లిన బాలిక ఇంటికి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): మదార్‌పురం పరిధిలోని జాతీయ రహదారి–44పై అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగళి నాగలింగం(60) కోలుకోలేక మృతి చెందాడు. ఈ నెల 18న డోన్ పట్టణం తారకరామనగర్‌కు చెందిన నాగలింగం కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణగిరి మండలం పుట్లూరు మారెమ్మ సన్నిధి నుంచి కారులో ఇంటి వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. మృతుని కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

సామాజిక సేవలో రోటరీ క్లబ్

ఎమ్మిగనూరుటౌన్: రోటరీ క్లబ్ ద్వారా ప్రజలకు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ గవర్నర్ సాదు తెలిపారు. పట్టణంలోని అయ్యప్పస్వామి కాంప్లెక్స్‌లో రోటరీ క్లబ్ కార్యాలయాన్ని క్లబ్ అధ్యక్షుడు కేఆర్ నట్‌రాజ్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు పద్మనాభరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థినీవిద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కేఆర్ నరసింహారెడ్డి, సుధాకర్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్, మాచాని వెంకటేష్, షఫీవుల్లా, బీరప్ప, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే

- ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా మలుపులు
- సూచికలు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయని అధికారులు
- నిత్యం ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



క్షేత్రగుడి–మోకా–బళ్లారి రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



ఆంధ్ర–కర్ణాటక రాష్ట్ర సరిహద్దు మోకా రహదారిలో ఉన్న మలుపు

హొలహర్వి: రహదారులపై మలుపులు ప్రమాదాలకు పిలుపుగా మారాయి. ఆద మరిచి ప్రయాణిస్తే అంతే సంగతలు అన్నట్లుగా మారింది. రహదారుల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేసే వారే కరువయ్యారు. దీంతో రోడ్లపై ప్రయాణించే వారు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కొందరు మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి. నేషనల్‌హైవే–167పై కూడా ఎక్కడా ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ, స్పీడు బ్రేకర్లు గానీ దర్శనమివ్వకపోవడం గమనార్హం.

ప్రమాదకర మలుపులు..

మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ రహదారుల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా హొలహర్వి–క్షేత్రగుడి వద్ద, హొలహర్వి నుంచి చింతకుంట గ్రామానికి వెళ్లే రహదారి, హొలహర్వి నుంచి గూళ్యం, నిట్రవట్టి–చింతకుంట, మల్లికార్జునపల్లి–కొక్కరచేడు, హొలహరి ¯ బాపురం ఎల్ఎల్‌సీ కాలువ రహదారి, ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని మోకా రోడ్డు, చింతకుంట రహదారుల్లో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఆ మలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. డ్రైవర్ ఆదమరిస్తే ప్రమాదంలో పడినట్లే. ఈ మార్గాల్లో మూల మలుపులతో పాటు కంపచెట్లు దట్టంగా అలుముకుపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. హొలహర్వి నుంచి చింతకుంటకు 12 కి.మీ. దూరం ఉంది. రహదారిలో ఐదు పెద్ద మలుపులు ఉన్నాయి. అ జాగ్రత్తగా ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

సూచికల్లేక ప్రమాదాలు..

క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయం వెనకవైపు ఉన్న మోకా–బళ్లారి రహదారిలో కొన్ని రోజుల క్రితం రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కారు కూడా బోల్తా పడింది. ఈ ప్రమాదాల్లో చాలామంది గాయపడ్డారు. ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. అలాగే స్పీడు బ్రేకర్లు కూడా లేవు. దీంతో అటుగా ప్రయాణించే వారు వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లుగా లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను, స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎంత జాగ్రత్తగా వెళినా ప్రమాదాలు జరుగుతున్నాయి



నేను నిత్యం హొలహర్వి నుంచి చింతకుంట, గూళ్యం, నిట్రవట్టి, అర్ధగేరి గ్రామాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటాను. ఈ రహదారుల్లో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. స్పీడు బ్రేకర్లు లేవు. ఎక్కడా హెచ్చరికల బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. నేను సక్రమంగా బైకుపై వెళ్తున్నా ఎదురుగా వచ్చేవారు జాగ్రత్తగా రాకపోతే యాక్సిడెంట్ జరిగే ప్రమాదం ఉంది. హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– అంచె గంగాధర, హొలహర్వి

నేషనల్ హైవేపై కూడా బోర్డులు లేవు



మాది చింతకుం గ్రామం. మా గ్రామం నుంచి హొలహర్వి–ఆలూరు–ఆదోని–ఎమ్మిగనూరు మీదుగా నేషనల్ హైవే–167 లైన్ వెళ్లింది. మా గ్రామం నుంచి ఈ హైవేపై ఎక్కడా ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ, స్పీడు బ్రేకర్లు గానీ ఏర్పాటు చేయలేదు. రోడ్లపై వెళ్లే వారు అప్రమత్తంగా వెళ్లినా హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. గతంలో చాలామంది ఈ రహదారిలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డారు.

– గంగాధరగౌడ్, చింతకుంట

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మాది గూళ్యం గ్రామం. నేను గ్రామం నుంచి మండలకేంద్రమైన హొలహర్వికి బాపురం ఎల్ఎల్‌సీ కాలువపై వెళ్తుంటాను. కాలువ వద్ద ప్రమాదకరమైన మలుపు ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అక్కడ పూర్తిస్థాయిలో మలుపు, ఎత్తు ఎక్కువగా ఉంది. ఎదురుగా వచ్చే వాహనాలు కంట్రోల్ కాకపోయినా ఇవతల ప్రయాణిస్తున్న వాహనాలను ఢీకొట్టే ప్రమాదం ఉంది. ఈ మార్గంలో టోపీ మారెమ్మవ్వ, దిబ్బల సోమప్పతాత దేవాలయాలు ఉండడంతో నిత్యం అధిక సంఖ్యలో భక్తులు ప్రయాణిస్తుంటారు. అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– చెన్నప్ప, గూళ్యం

రైతు సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆస్పరి తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టుబడి సహాయం ఇస్తానని చెప్పి ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి సహాయం అందలేదన్నారు. ఇచ్చిన హమీలు నెరవేర్చకుండా నెలకోసారి ప్రజల దృష్టి మళ్లించేందుకు ముఖ్యమంత్రి ఏదో ఒక విధంగా సంచలనాలు మాట్లాడడం మంచిది కాదన్నారు. అనంతరం డీటీ గాయత్రికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగస్వామి, రామాంజినేయులు, మధుసూదన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాల పరిశుభ్రత

వెల్దుర్తి(కృష్ణగిరి): స్వచ్ఛ గ్రామలకు అందరి సహకారం అవసరమని డీపీఓ నాగరాజునాయుడు అన్నారు. మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడటంతో పాటు తాగునీటి లికేజీలపై అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఓఆర్డీ నరసింహులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆలూరు: మండలంలోని కురువెళ్లి గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు ఎంపీడీఓ అల్లబకాష్‌ను కోరారు. మంగళవారం ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న కొందరు సిబ్బందిని బదిలీలను నిలిపివేయాలన్నారు. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీల సదుపాయం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, కుంటలలో పూడిక తీత పనులు చేపట్టాలని కోరారు.

సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు



టి.గోకులపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

కృష్ణగిరి: పంటలసాగులో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మండల పరిధిలోని టి.గోకులపాడు, తొగర్చేడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి పంటసాగుపై రైతులకు పలు సూచనలు తెలియజేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. వర్షాలు పడుతున్న సమయంలో పంటలకు చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందని ముందు జాగ్రత్తగా రైతులు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి నవీన్ మాట్లాడుతూ.. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్పంచ్‌లు రామాంజినేయులు, రేణుక, ఏఈఓ అనీల్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వలంటీర్లకు న్యాయం చేయాలని వినతి



ఆర్డీఓ రామలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న వలంటీర్లు

పత్తికొండ(తుగ్గలి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని గ్రామ, వార్డు వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎన్నికల ముందు కూటమి నేతలు వలంటీర్లను తొలగించమని, రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికలు పూర్తయిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లను విధుల్లో తీసుకోవడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10వేలు గౌరవ వేతన ఇవ్వాలని కోరారు. రాజీనామా చేసిన వలంటీర్లను కూడా విధుల్లో తీసుకోవాలన్నారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని చెల్లించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ రామలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

–నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

పత్తికొండ(తుగ్గలి) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పత్తికొండ జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎంపిక క్రీడా పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. పోటీలను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రారంభించారు. మొదటి రోజు అండర్ 14, 17 విభాగాల్లో బాలురకు కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్‌లో ఎంపిక పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 600మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ చందూనాయక్ తెలిపారు. బుధవారం బాలికలకు క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరామయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, ఎంఈఓలు తిమ్మారెడ్డి, రమేష్, మాలతి, రామవెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సమాజ సేవ అలవర్చుకోవాలి



విద్యార్థిని బహుమతి అందజేస్తున్న ఎంపీ

పత్తికొండ(తుగ్గలి): విద్యార్థి దశ నుంచే సమాజ సేవ చేయడం అలవాటు చేసుకోవాలని.. ఇందులో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కీలక పాత్ర వహిస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దినోత్సవానికి ఎంపీ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎన్ఎస్ఎస్‌తో సమాజంపై అవగాహన, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజసేవ చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించడం, మొక్కలు నాటడం గొప్ప విషయమన్నారు. చదువు, విజ్ఞానంతో పాటు సమాజ బాధ్యత, సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వలంటీర్లకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెదేహాల్‌లో అధికారుల పర్యటన



గామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్ర, తహసీల్దార్ నజ్మాబాను

హొలహర్వి: మండలంలోని మెదేహాల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్లకు అడ్డుగా బాత్‌రూమ్‌లు, ఇళ్ల నిర్మించుకోవడంతో రోడ్లు చిన్నవి కావడంతో స్థానికులు తహసీల్దార్ నజ్మాబానుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ పాటు ఎస్‌ఐ చంద్ర, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. ప్రజలతో మాట్లాడి నచ్చజెప్పారు. దీంతో సమస్య సద్దుమణిగింది. అధికారుల వెంట పంచాయతీ కార్యదర్శి ఈరన్న, వీఆర్వో మస్తాన్ ఉన్నారు.

ఎంపీడీఓల బదిలీలు

పత్తికొండ/తుగ్గలి: పలువురు ఎంపీడీఓలను బదిలీ చేస్తూ జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పత్తికొండ ఎంపీడీఓ ఎం.కవిత పగిడ్యాల మండలానికి బదిలీ కాగా ఆమె స్థానంలో నందికొట్కూరు ఎంపీడీఓ ఎం.శోభారాణి నియమితులయ్యారు. తుగ్గలి ఎంపీడీఓ కె.సావిత్రి దొర్నిపాడుకు బదిలీ కాగా ఆమె స్థానంలో కృష్ణగిరి ఎంపీడీఓ కె.విశ్వమోహన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీదేవి

మద్దికెర: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీదేవిని నియమించినట్లు తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ మంగళవారం తెలిపారు. గతంలో ఒక్కడ పనిచేస్తున్న పురుషోత్తం బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీదేవిని మద్దికెరకు బదిలీ చేశారన్నారు.

హొళగుంద ఎంపీడీఓగా విజయలత

హొళగుంద: మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి (ఎంపీడీఓ)గా విజయలతను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం ఎంపీడీఓగా పని చేస్తున్న ఆమెను ఉన్నతాధికారులు హొళగుందకు బదిలీ చేశారు. ప్రస్తుతం హొళగుంద ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సుహాసినమ్మ వెల్దుర్తికి బదిలి అయ్యారు. అయితే బదిలీ అయిన అధికారులు వచ్చే నెల 2వ తేదీ వరకు ఎక్కడ ఉన్న వారు అక్కడే విధులు నిర్వహించాలని, ఆ తరువాత రిలీవ్ అవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఫిర్యాదు

ఎమ్మిగనూరుటౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమాన పరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మిగనూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో స్థానిక ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. గ్లోబల్ రిపబ్లిక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నాగేంద్ర, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నర్సప్ప, భారత ప్రగతిశీల యువజన సంఘ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు చార్లెస్, ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకుడు రంగన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, స్థానిక నాయకులు ప్రసన్న స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సుదర్శన్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి, వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. అంతకు మునుపు వైఎస్సార్ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చి సోమప్ప సర్కిల్‌లో ఎమ్మెల్యే రఘురామ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు కేవీకేలో మిరప రైతులకు శిక్షణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26వ తేదీన మిరప పంట సాగు చేసే రైతులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్రచౌదరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

27న జాబ్‌మేళా

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా మంగళవారం తెలిపారు. ఈజాబ్ మేళాలో నవభారత్ ఫర్టిలైజర్స్, వికాస్, అరబిందో ఫార్మా, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆయా కంపెనీల్లో 250లకు పైగా ఖాళీలు వున్నాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీఎస్సీ, బీటెక్, ఐటీఐ విద్యార్హతలున్న వారు జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నార

వర్షం కోసం సప్త భజనలు



దొనపాడు దేవాలయంలో భజనలు చేస్తున్న భక్తులు

మద్దికెర: వర్షాలు కురిసి పంటలు పండాలని కాంక్షిస్తూ మండల పరిధిలోని ఎం.అగ్రహారం సమీపంలో ఉన్న దొనపాడు శివాలయంలో మంగళవారం సప్త భజనలు చేపట్టారు. ఈ సందర్భంగా దేవాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు రోజుల పాటు భజనలు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అన్నదానం చేయనున్నట్లు చెప్పారు.

పంటల సాగులో అధికారుల సూచనలు పాటించాలి



కుంకనూరులో పత్తి సాగుపై సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

హొళగుంద: పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఆలూరు ఏడీఏ సునిత సూచించారు. మంగళవారం ఏఓ ఆనంద్ లోకదళ్ ఆధ్వర్యంలో హొళగుందలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పంటలకు డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్, సర్పంచ్ చలువాది రంగమ్మ, మండల ప్రత్యేకధికారి నాగేశ్వరరావు, ఎంపీడీఓ సుహాసిన పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

దేవనకొండ: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సురేష్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని కుంకనూరు గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. పంటకు వచ్చే తెగుళ్లు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలు, వ్యవసాయ సాంకేతిక సలహాలు, సూచనలు ఇచ్చారు.

హొలహర్వి: మండలంలోని బిలేహాల్, విరుపాపురం గ్రామాల్లో వ్యవసాయశాఖ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో «పొలం పిలుస్తోంది» కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఓ శివశంకర్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వస్తున్న సాంకేతిక పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, ఉత్పత్తితో పాటు రైతులకు ఆదాయం పెరుగుదలకు రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

నూతన పీఆర్సీని అమలు చేయాలి



తుగ్గలిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తుగ్గలి: నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పాండురంగారెడ్డి కోరారు. మంగళవారం తుగ్గలి, పత్తికొండ మండలాల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం పాఠశాలలకు స్కూల్ గ్రాంట్, టీచర్స్ గ్రాంటు విడుదల చేయాలని, ఆశ్రమ పాఠశాలలో వార్డెన్‌లను నియమించాలన్నారు. పాఠశాలల్లో నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిపోయిన నాడు–నేడు పనులు పూర్తి చేయాలని కోరారు. సింగిల్ టీచర్లు ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని, నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాశీంసాహెబ్, విజయభాస్కరరెడ్డి, జయరాముడు, లోక్యానాయక్, రవీంద్రనాయక్, వెంకటేశ్వర్లు, సంజన్న పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సీడీపీఓ మద్దమ్మ

ఆస్పరి: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత వస్తుందని ఆస్పరి సీడీపీఓ మద్దమ్మ తెలిపారు. మంగళవారం ఆస్పరిలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు, పండ్లు, ఆకు కూరలు, ఆహారంగా తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన స్టాల్స్‌ను సీడీపీఓ పరిశీలించారు. కార్యక్రమంలో దేవనకొండ, ఆస్పరి సూపర్‌వైజర్లు శివలింగమ్మ, సునీత, పద్మ, షాహీనీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి సొమ్ము రికవరీ చేస్తాం



పనుల్లో అవకతవకలపై ఆరా తీస్తున్న డ్వామాపీడీ అమరనాథరెడ్డి

హొలహర్వి: ఉపాధి పనుల్లో జరిగిన అవినీతి సొమ్మును ఎప్పటికప్పుడు రికవరీ చేస్తామని డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17వ సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. పీడీ మాట్లాడుతూ మండలంలో 01–04–2023 నుంచి 31–03–2024 వరకు ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై 17వ సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. మండలంలోని 15 గ్రామాల్లో జరిగిన పనుల్లో జరిగిన అవకతకల్లో రూ.18,398 రికవరీ చేశామన్నారు. రూ.22 వేలు పెనాల్టీ విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళేశ్వరగౌడ్, వైస్ ఎంపీపీ నగేష్, అడిషనల్ పీడీ మాధవీలత, ఎస్ఆర్‌పీ విజయభాస్కర్, ఏపీఓ హేమసుందర్ పాల్గొన్నారు.